# శిథిలాలలో ప్రేమ

ప్రత్యేకమైన పనికి నియోగించబడిన కొన్ని వందల మందిలో నే నొకడిని.

ఆ పని కార్ఖానాను గుర్తు తెస్తుంది.

కార్ఖానా బయట-జీవితంలో రకరకాల వెలుగునీ, చీకటినీ, మసకనీ చూసే జిజ్ఞాసాపరుడిగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో-

"ఎవరావిడ? రంగనాథ్‌ని అడిగాను.

అతను నాకంటె పదేళ్ళు చిన్న. శిష్యతుల్యుడు. నన్ను 'గురూజీ' అని పిలుస్తాడు.

"కన్యాకుమారి!"

"ఏ వూరట?"

"ఒంగోలో...కర్నూలో..సరిగా వినపడలేదు."

"హుఁ! చాలా అందమైన అమ్మాయి."

"నిట్టూర్పా! గురూజీ! మీకు పెళ్ళి అయిపోయింది!"

"కన్యాకుమారికీ అయిపోయిందా?"

"ఏమిటి, సార్, ఇలా..."

"సరే- నేను తెలుసుకోగలనులే!"

కార్ఖానాలో అప్పటికే రెండు రంగుల బాల్‌పాయింట్ పెన్నులు ప్రభుత్వ కాగితాలమీద కదం తొక్కుతున్నాయి. లోపలికి వెళ్ళాలి.

"మరేం అనుకోకండి. ఎందుకు ఇన్ని ప్రశ్నలు?"

"చిన్నవాడివి. సౌందర్యలాలస ఉంటే చుట్టూ సౌందర్యమే...దానిని ఆస్వాదించటమంటే ముతకగా అనుభవించాలనుకోడం కాదు..ఇక వెళదామా?"

"గుడ్ ఆఫ్టర్‌నూన్! మీట్ మై ఫ్రెండ్!" నా పేరు చెప్పి నన్ను అతనికి పరిచయం చేశాడు. రంగనాథ్. అతని వెనక..." మై ఫ్రెండ్..మిస్ కన్యాకుమారి!" అతను పరిచయం చేశాడు.

పరిచయా లైపోయాయి.

"మీ నవల మొదటినుంచి చివరి వరకు చదివాను!" ఆమె చటుక్కున అంది.

నాకు వెయ్యకుడనిదివేసింది-సిగ్గు.

"కొన్ని అక్కడా అక్కడా చదువుతావా?" క్రాంతికుమార్ అడిగాడు.

"వీరి నవల సీరియల్‌గా వచ్చింది. ఒక భాగం కూడా తప్పకుండా చదివావని చెబుతున్నా! సర్! సుందరి చాలా అందంగా ఉంటుందా? ఆమెను మరచిపోలేకపోతున్నాను."

"టీ తీసుకో!" క్రాంతికుమార్ టీకప్పు తీసుకొచ్చాడు.

"మేం గోల్కొండ వెళుతున్నాం!"

"మా పేర్లూ ఇచ్చాడు రంగనాథ్."

"మరే మంచి కంపెనీ..." ఆమె కళ్ళలో మెరుపు.

"కమాన్, కుమారీ! చెట్టుకింద కూచుందాం." ఆమె అతని వెనకాలే వెళ్ళిపోయింది

"క్రాంతికుమార్ నీకు తెలుసా?" నేను రంగనాథ్‌ని అడిగాను.

"మా సీనియర్. డెబ్భైనాలుగు బ్యాచి."

నేను సిగరెట్టు కోసంతడుముకుంటూ ఉంటే రంగనాథ్ ఇచ్చాడు. సిగరెట్టు కంపెనీ ఎడ్వర్టయిజుమెంట్ గుర్తొచ్చింది. ఒకరికోసం ఒకరు తయారు చెయ్యబడిన జంట-'మేడ్ ఫర్ ఈచ్ అదర్.'

"లేవండి, సార్!" రంగనాథ్ నన్ను బస్సులో కుదిపి లేపాడు. గోల్కొండ ఖిల్లా వచ్చేసింది.

ఇద్దరేసి, ముగ్గురేసీ ముందుకు నడుస్తున్నారు.

దర్వాజా దగ్గర చప్పట్లు కొడితే దూరంగా కొండమీద మెషిన్ గన్ మోతలా వినపడుతోంది శబ్దం.

ఎందుకో తాళంకప్ప జ్ఞాపకం వచ్చింది. మధ్యయుగంలో పాతివ్రత్య పటకాలకి తాళంకప్పలు వేసేవారట. ఏవేవో భద్రతా చర్యలు..

"గుడ్‌మార్నింగ్, సర్! మీతో కలిసి రావచ్చా?" కన్యాకుమారి అడిగింది.

"ఇది రంగ్ మహల్. నవాబు జనానాలోని బీబీలు, బీగమ్‌లు ఇక్కడే ఈ కొలనులో జలకాలాడేవారట."

నీరు ఇగిరిపోయిన కొలనుముందు క్రాంతికుమార్, కన్యాకుమారీ...

శిథిలాల మధ్య ఈ దయనీయమైన అవస్థను తప్పించుకోడానికి శాయశక్తులా ప్రయత్నిస్తూ నిటారుగా నిలబడింది ఆ మహల్.

వడలిపోతున్న యౌవనాన్నీ బిగపట్టి నుంచో పెట్టుకోడానికి ప్రయాసపడే మనిషి తపన గుర్తుకొచ్చింది.

అంతేకాదు. మరొకటీ గుర్తుకొచ్చింది.

—"సర్, ట్రంక్‌కాల్! రామారావ్‌గారు మీరేనా?"

"నాకు ట్రంక్‌కాలా? ఎక్కడ మంచి?" రేజర్ గడ్డంమీదనుంచి ఎత్తి అడిగాను.

"బెంగుళూరు"

గుండె దడదడ లాడుతుండగా పరిగెత్తాను.

—"హలో! రావ్ ఎవరిది?"

"చాల్లెండి బడాయి! మూడు రోజులై ఉత్తరం లేదు. ఎందుకట అబ్బాయిగారికి అంత కోపం"

ఆమె మాటలు అందరూ వింటున్నారన్న భ్రాంతితో.....భయంతో... సిగ్గుతో ఒళ్ళు చచ్చిపోయింది. చుట్టూ చూశాను.

"ఉత్తరం రాయలేదు. తీరిక లేదు. కార్ఖానా!"

" వై! అబద్ధం! పచ్చి అబద్ధం.... బండ అబద్ధం!"

"అయితే మాత్రం... టెలిఫోన్..."

"రెండున్నర గంటలై వెయిట్ చేస్తున్నా. మా ప్రొఫెసర్ ఇంటి నుంచి... వాళ్ళకు తెలుగు రాదులెండి."

"యూ ఫూల్!"

"మీరు అలాగే అంటారు మీరు కోపంతో రాసిన ఉత్తరం అందింది. తరువాత నిజంగానే రాయడం మానేశారు. నాకు బెంగ... నేను బయలు దేరుతున్నా. రేపు సాయంకాలం... కాచిగూడా చేరేసరికి ఆరున్నరవుతుందట."

"రియల్లీ! కానీ, ఏయ్, రాణి  నా కలీగ్స్....

"యూజ్ యువర్ బ్రెయిన్స్!"

"మన వూరువారోయ్! వాళ్ళు ఇంటిదగ్గర...."

"మీ ఆవిడతో చెప్పేస్తారు! సర్ నేనూ ఆడదాన్ని. మీరు కాదు. ప్లీజ్ ఎక్స్‌టెండ్... అబ్బ! ఇదొక గొడవ. వాళ్ళ సొమ్ము పోయినట్టు అరుస్తారు ఈ ఆపరేటర్లు. మహాప్రభో, అక్కడున్నారా?"

"ఆఁ! ఇక పెట్టేయ్యనా"

"అంటే, ఇంతసేపూ ఇక్కడ... నేను ఏం మాట్లాడరేం?"

"ఏం మాట్లాడను?"

"కోపం పోయిందా?"

"నిజంగా వచ్చిందనుకున్నావా?"

"మరి అనుకోనా? ఆ ఉత్తరం చదివితే నాకు చచ్చే ఏడుపు వచ్చింది. ఉన్ని కృష్ణన్, గ్రేస్ అంతా చుట్టూ మూగేశారు, ఏమైందంటే. ఏం చెప్పను, బాబూ! మీ కోపం సముఖంలోచూపించండి కాని..."

"మళ్ళీ ఏడ్చేసేటట్టు న్నావ్! యూ సిల్లీ. ఇక ఫోన్ బిల్ పెంచకు. నాకు కోపంలేదు. స్టేషన్‌కువస్తా. పెట్టేస్తా బై!"

"బెంగుళూరులో మీ వాళ్ళెవరున్నారు?" ఒక సహోద్యోగి ఆరా తియ్యబోయాడు.

"రామారావ్ పేరుతో వచ్చిన చిక్కు ప్రతి పదిమందికి ఒక డుంటాడేమో!

సెకండ్ ఫ్లోర్‌లో ఓ రామారావ్‌కి ఆ కాల్!"

-ప్లాట్‌ఫారమ్ మీద హడావుడిగా తిరుగుతున్నాను. రైలొచ్చి మూడు నిమిషాలైంది. రాణి జాడ లేదు.

"ఏమండీ!" రాణి గొంతు.

స్వెట్టర్, మఫ్లర్... అంతా వూలు. "వూల బంతిలా ఉన్నావు!" అన్నాను. రూముకెళ్ళాక "వెలుగుబంటిలా ఉన్నావు" అన్నాను. రాణి రక్కేసింది. చాలాసేపు నవ్వుకున్నాం.

గోల్కొండ వెళ్ళాం. రామదాసు బందిఖానా, రామాలయం- ఆ ఎత్తులు ఎలా ఎక్కేవారో! నాకు పిక్కలూ, తొడలూ నొప్పు లెడుతున్నాయి. సాయంకాలం వరకూ తిరిగాం. రాణికి అలసట ఉండదు.

"కాళ్ళు పీకుతున్నాయి!"

"పట్టనా?"

ఆమె పెదవులమీద చెయ్యి వేశాను నా వేళ్ళు ఆమె గుప్పెట్లో దాచుకుంది చాలాసేపు.

"ఏమండీ! మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి! అందుకే వచ్చాను. మీ కోపం, మీ తాపం ఉత్తరాల్లో తట్టుకోలేను."

నాకు కళ్ళు మూతలు పడుతున్నాయి.

"ఏమిటో అంత ముఖ్యం? " ఆమె నుదుట వేలితో గిరులు గీస్తూ అడిగాను.

"బొట్టు చెరిపేస్తున్నారా?"

"నో! నో!" పెదవులతో ఆమె నుదుట... ఆమె కొంత కాలం మరిచి పోయింది. ఆమె చెప్పబోయే దేమిటో తెలుసుకోలేనంత మూర్ఖుడిని కాదు.

"మా వాళ్ళు నాకు సంబంధం చూశారు!"

"పురిటికి వస్తావుగా!" నాలో ఏదో దుష్టశక్తి నన్ను ప్రేరేపించింది. ఆరాధనలోని స్త్రీకి సహనం అపరిమితం.

"ఇక నిద్రపొండి! అలిసిపోయారు."

ఆ గొంతులో కన్నీళ్ళు- ఆవేదన- ఆక్రోశం ఆ క్షణంలో వినరాలేదు. ఇప్పుడు మరపు రావడమూ లేదు.

రెండు రోజులు -రెండు వసంతాలు రెండు జీవితకాలాలు నాకు మధువు పంచి ఇచ్చి రాణి రైలెక్కి పోయింది... నేను ఎక్కించేశాను.

"మీ ముఖంలో ఏమిటో ఆ తళతళలు?"

రూమ్‌కి వచ్చాక అడిగా డొకతను.

క్రాంతికుమార్ ముఖంలోని తళుకులు ఆ కోవలోవేనా? ఆ చంద్రోదయాలేనా అక్కడ నెత్తావులు గుబాళిస్తున్నాయి?

"ఇక్కడ పన్నీటి స్నానాలు చేసే వారట!"

"ఇప్పుడు అక్కడ వాసన చూడకు!" అంటున్నాడు క్రాంతి.

"పురిటికి వస్తావుగా!" అంటున్నాను నేను.

"బొట్టు చెరిపేస్తున్నారా?" అంటూంది రాణి.

నా మనసులో ఆలోచన- "యూ ఫూల్! క్రాంతికుమార్! ఆమె నిన్ను ఆరాధిస్తోంది. ఆమె కళ్ళు చూస్తే తెలియడం లేదూ? సిల్లీ ఫెలో! ఏ స్త్రీ అయినా ఆరాధనని జీవితంలో ఒకే ఒకసారి, ఒకే ఒక్క పురుషుడికి ఇవ్వగలదు! టేకిట్- టేకిట్ ఫర్ ఆల్ టైమ్. అందబోతున్న మధుకలశాన్ని చేయి జారవిడుచుకోకు!"

బాధపడడం లోని విలువ, దాని లోతులు తెలుసుకున్న మనిషే ఆ బాధను విరోధించడానికి. ఉపాయాన్ని సూచించగలడేమో!

ఆమెను ముట్టుకో కుండానే క్రాంతి కుమార్ ఆమెను లాక్కు పోయాడు.

గుండెలో ఏదో వెలితి- వైరాగ్యం.

హర్మ్యాలూ, విలాస భవనాలూ, రాచనగరులూ రాళ్ళ కుప్పలుగా మిగిలిపోయాయి.

శిథిల ప్రేమ శకలాలు గాజు పెంకుల్లా గుండెలో గుచ్చుకుంటున్నాయి. గుండెలో నుంచి రక్తమూ, కళ్ళలో నుంచి నీళ్ళూ బయటకు చిప్పిల్లవు. లోపల ఇమడవు- ప్రేమికుల నరక మంటే ఇదేనేమో!

క్రాంతికుమార్‌కు సలహా ఇవ్వలేక పోయాను. పిరికివాడిని. పోగొట్టుకున్న తరవాత పోగొట్టుకున్నదాని విలువ కళ్ళ ముందుకు వచ్చి వెక్కిరిస్తుంది.

రాణి మనసు లోని ఆరాటం. ఆనాడు అర్థం చేసుకోలేకపోయాను. మనసారా తనని ఆశీర్వదించమని ఆ మూగ మనసు ఆరాటం.

జీవితాంతం ఆమెను నా దాన్నిగా చేసుకోలేనని రాణికీ తెలుసు. ఆమె నన్ను మోసం చెయ్యలేదు. నన్ను నేనూ మోసం చేసుకోలేదు.

ఈ శిథిలాలకు కారకు లెవరు?

రాణి కాదు- నేను కాదు- నా భార్య కానేకాదు. నే నెవరినీ అర్థం చేసుకోలేక పోయినా వారిద్దరూ నన్ను అర్థం చేసుకున్నారు.

అందుకే ఆరాధించే స్త్రీకి సహనం అమితం అని పునరుక్తి దోషం లేకుండా మళ్ళీ అంటున్నాను.

-కన్యాకుమారి రామాలయంలో శిరస్సు వంచి చేతులు జోడిస్తూంది.

"నాకు పిచ్చి నమ్మకాలు లేవు." క్రాంతి అంటున్నాడు.

మగవాడి అహంకారం ఎంత వికృతంగా ఉంటుంది! ఆ ఆసహ్యకరమైన లక్షణాన్ని తట్టుకోగలిగి నందుకు గానే స్త్రీ మూర్తి అంత పవిత్రగా రూపొందించబడిందేమో!

లైంగికానందమే వరమార్థమనుకునే మగాడు తాను ఆరాధించే స్త్రీ ఎత్తుకి ఎదగడానికి ఎన్ని వేల సంవత్సరాలు పడుతుందో!

—"గురూజీ! కన్యాకుమారి గురించి ఆలోచిస్తున్నారా?"

"లేదు. స్త్రీ ఔన్నత్యం తెలుసుకోడానికి ప్రయత్నం చేస్తున్నాను."

"దాని ఔన్నత్యం కనపడుతూనే ఉంది."

"డోన్ట్ బీ ఎ బ్రూట్! ఆమె ఎందుకు పెళ్ళి చేసుకో లేదో?"

"పెళ్ళెందుకురా, పెదబాబూ!" ముతక సామెత పొడిచాడు. నేను జూనియర్ అని పిలిచే రంగనాథ్.

ఎంత జుగుప్సాకరమైన భావన! సిగరెట్టు వెలిగించుకున్నాను. దుర్గంధానికి అక్కడికి అదే విరుగుడు.

"లంచ్‌కి పిలుస్తున్నారు!"

నా కుడిపక్క కన్యాకుమారి, ఎడమ పక్క జూనియర్.

"సుందరిని మీరు ఒకసారి గోల్కొండ తీసుకొచ్చారు కదూ!" స్వీటు మునిపంట కొరుకుతూ అడిగింది కన్యాకుమారి.

అలాంటి చిక్కు పరిస్థితుల్లో మౌనమే శరణ్యం. అది మనసులో లేని లోతుల్ని ఇతరులకు స్ఫురింప చెయ్యగలదు.

"అజంతా శిల్ప సుందరిని ఇక్కడి కెందుకు నడిపించు కొచ్చారు?"

నేను తేరు కున్నాను. "యూ ఆర్ ఎ క్లెవర్ రీడర్!"

"నన్ను పొగిడి మాట మార్చకండి. సుందరిలో ఏదో చెప్పలేని అందం. ఏమాత్రం ఆలోచనలతో చదివినా ప్రతి రచనలోనూ ఆమే సాక్షాత్కరిస్తుంది. అదే మీ రచనలలోని అందం."

"అదే అవగుణమని నా భార్య అంటుంది. ఎవరి ఇష్టం వాళ్ళది."

"రచయిత భార్యగా జీవించడం బిగువు తాటి మీద నడకేమో! డిఫికల్ట్ టైట్ రోప్‌వాకింగ్ కదూ!"నా వాక్యానికి టీక చెప్పబోయింది ఆమె.

"భోజనం దగ్గర సాహిత్య చర్చా?" జూనియర్ నవ్వాడు.

"మళ్ళీ సుందరి పునర్దర్శనం ఎప్పుడో?"

"నా శరీర వ్యవస్థ నుంచి సుందరిని విసర్జించుకున్నాను..."

"మీకు మీరే హాని చేసుకుంటున్నారు!"

ఆమె అంత సూటిగా విషయాన్ని వెల్లడించగల దనుకోలేదు. ఏదో అడగాలనీ, అర్థం కానట్లు నటిస్తూ అడిగాను" వై? ఎలాగ?"

"ఇదేనా భోజనం చేసే తీరు! మీకు సుందరిని జ్ఞాపకం చెయ్యడం పొరపాటయిపోయింది."

సెన్సిటివ్ గర్ల్! సుందరిని ఆమె నాకు జ్ఞాపకం చేశా ననుకుంటోంది.

ఏదో అద్భుతమైన కలను, అపురూపంగా పునర్జీవించగలిగిన నాకు కన్యాకుమారి మళ్ళీ నాలుగేళ్ళ తరవాత తారసిల్లింది -వరంగల్‌లో.

ఈ మారు నా పక్క రంగనాధ్ లేడు, మరో జూనియర్ వచ్చాడు.

"ఈయన మా గురూజీ! సుప్రసిద్ధ అనను కాని ఎ కాంప్లెక్స్ నావెలిస్ట్!" నన్ను పరిచయం చేశాడు కన్యాకుమారికి.

ఆమె పకపకా నవ్వేసింది. జూనియర్ తెల్లముఖం వేశాడు.

"రామప్ప దేవాలయంలో శిల్పసంపద చూడకుండా వెళ్ళిపోవడం అమానుషం. కేవలం మిల్లులో పనిచేయడమే జన్మకి సార్థకత కాధు!"

అబ్బురంగా మనసున్న ఒక ప్రభుత్వోద్యోగి బస్సులు కుదిర్చాడు. మూర్ఖులను ప్రాధేయపడకుండా వాళ్ళు కోరే పనివేళకు తిరిగి రావచ్చన్నాడు.

"చూశారా ఎంత పొగరో దానికి! నన్ను చూసి వెనుదిరిగిపోయింది."

నేను తల తిప్పకుండానే ఆ విసురు కన్యాకుమారి మీదనేనని గ్రహించాను.

"నిన్ను చూసిన,నీకు నచ్చిన ప్రతి యువతీ నీతో ప్రేమలో పడిందన్న భావన షేక్స్పియర్ మనకి అందించిన మాల్‌వోలియోకే చెల్లింది. మనం అందరం ఒకప్పుడు కాకపోతే మరో కప్పుడయినా మాల్‌వోలియోలమే... నువ్వు ఇంకా ఎదగాల్సి ఉంది."

"కన్యాకుమారి వస్తోందట రామప్ప గుడికి."

"ఓహ్! అలాగా!" నాకు ఆసక్తి చచ్చిపోయింది. ఆమె వ్యక్తిగత జీవితాన్ని మథించబోతే మణులే దొరుకుతాయో, తిమింగలాలే ఎదురవుతాయో!

కేకలు వేసే మామూలు మూకలు వెగటు పుట్టిస్తాయి. నేనూ, జానియర్ గెస్ట్ హౌస్‌కిఅనుకున్న శిథిలాలయంలోకి వెళ్ళాం. గర్భగుడిలో అగ్గిపుల్ల వెలిగించాను.

లోపల బుగ్గి తప్ప మరేం లేదు. విధి నిక్షేపాలు అక్కడలేవని తెలుసుకున్నారంతే.

చీకటిలోనుంచి వెలుగులోకి వచ్చే సరికి ఎదురుగా నంది, వెనుక కన్యాకుమారి! "మీరూ, వచ్చారా?"

ఎందుకో నా కళ్ళకు చటుక్కున రాణి కనపడింది. నా గుండె లయ తప్పింది.

"క్రాంతికుమార్ రాలేదా" అని అడగబోయి ఎంతో కష్టంతో పెదవి జారనున్న ప్రశ్నను నిగ్రహించుకుని పాదివి పట్టుకున్నాను.

జూనియర్ ముందు కనపడుతున్న గుంపులో కలిసిపోయాడు, రామప్ప సరస్సు మీద సూర్యోదయ కిరణాలను చూడడానికేమో!

"మొన్న వరంగల్ జిల్లాకు వెళ్ళాను. ఆడవాళ్ళతో. మీరు అక్కడ తారసిల్లుతారనుకున్నాను."

"స్వయంభు: - పాతకోట....... మేం వచ్చిన రెండవ రోజునే చూశాం. ఆ తోరణాల మధ్య ఆ శిథిలాలలో నాకు దు:ఖం ఆగలేదు. అక్కడ ఆలయంలో నంది చూశారా? మనం ఎటు తిరిగితే అటు మన వంకే చూస్తున్నట్టు ఉంటుంది. నేనూ గుర్తించలేదు. ఎవరో పుణ్యాత్ముడు అది నా దృష్టికి తెచ్చారు..... పురోభివృద్ధి అంటూ ఈ కళ అన్నిటికీ ఎంత దూరంగా పోతున్నామో నన్న తపన మనకు లేదు.రండి, వెళదాం...."

బస్సు రామప్ప గుడి వద్ద ఆగింది.

నేను బస్సు దిగాను. కన్యాకుమారి నా దగ్గరకు వచ్చింది.

తీరికగా గుడి బయట శిల్పసౌందర్యాన్ని చూస్తూ అలా ప్రదక్షిణలు చేస్తున్నాం.

పేదకి పెన్నిధి దొరికితే మణులేవో, మరకతా లేవో తెలుసుకోలేక రత్న రాసుల్ని నెత్తిమీద నుంచి పోసుకుని ఆనందంలో జలకాలాడుతాడు.

అదే నా స్థితి. ఒకొక్క ప్రదక్షిణలో ఒకొక్క ఎత్తు చూస్తున్నాం. మదని కలూ, నాగినులూ. దేవతలూ- కళ్ళు చెదిరి పోతున్నాయి.

ఒక దగ్గర ఆగిపోయాను. మెడ కిందకు దింపకుండా అలా మైమరిచి చూస్తున్నాను.

ఆ శిల్ప సుందరి వివస్త్ర -నగ్నంగా ఉన్నానన్న భావన లేని కారణాన్నేమో ఆమె ముఖంలో ఏం శోభ! ఏం తళుకులు!

శృంగారభావం ఆమె ముఖంలో చిందులేస్తూంది.

ఏ రసికుని సన్నిధి లోనో..... ఆమె ఆ కించిత్ అచ్ఛాదన....

ఎవరో రాక్షసుడు ఆ చేతిని... అరచేతిని మోచేతిని పగలగొట్టాడు.

ఏం కనపడింది? వా రనుకున్న అందం కాదు. ఆచ్ఛాదనగా వేసుకున్న అరచెయ్యి కింద శిల్పి ఏం చెక్కగలడు? చేతి కింద ఉన్నది శిలే!

స్త్రీ సౌందర్య రహస్యాన్ని - జీవిత మాధుర్యాన్ని ఎంతో తెలివిగా శిలపై సాక్షాత్కరింప చేశాడు. అచ్ఛాదనలోనే ఉంది ఉండాల్సినదీ, ఉన్నదీ అంతా.

గుప్పిడి విప్పితే ఏముంటుంది! అదే సౌందర్య మర్మం.

కీచకులకూ, పాషండులకూ సౌందర్యోపాసనా, రసాస్వాదనా తెలుస్తాయా!

శిల్పసుందరి నా వంక అదోలా చూస్తూంది. నా వంకే కాదు, అందరి వంకా.

ప్రియుని సన్నిధిలో తన శృంగార హేలను మూడవ కంటివాడు చూస్తే ఎలా సిగ్గుపడుతుందో అలానే సిగ్గు పడుతూంది.

ఆమె చూపులో మార్పు? కాలక్రమేణా సౌందర్య హంతకుల చేత పడి తరవాత ఆమె చూపులో మార్పు వచ్చిందేమో!

కాని ఆ నాగిని మనల్ని చూసి ఏవగించుకుంటూందనలేం.

ఏవగింపూ, ద్వేషమూ అవగాహనా లోపానికి నిదర్శనాలేనా! ఆమె మనల్ని చూసి జాలి పడుతూందేమో! లేదా ఆ జాలి తన మీద తనకే వేస్తుంటే వాళ్ళలో ఆ భావన వచ్చిందా?

సన్నగా ఎక్కడినుంచో రోదన.

భళ్ళున ప్రస్తుతం లోకి మేల్కొన్నాను.

రాతి మండపంలో కన్యాకుమారి చీర చెంగులోకి వెక్కుతూంది. ఆలయం చూడవచ్చిన మా వాళ్ళు నగ్న సుందరులందరనీ గబగబా చుట్టేసి చెల్లా చెదరై పోయారు.

"క్షమించండి! మిమ్మల్ని.... ఆ శిల్పం.... ఏమనాలో, ఏమంటున్నానో తెలియకుండా మాట్లాడేస్తున్నాను."

ఆమె లేచి నుంచుంది. కళ్ళు తుడుచుకుంది.

అంత తొందరగా తెప్పరిల్లుకో గలగడం ఆడవాళ్ళకే చెల్లింది.

"సారీ! ఏదో జ్ఞాపకం వచ్చింది. మీ సుందరి ఈ పరిసరాల్లో పునర్దర్శనం ఇస్తుందని పాఠకురాలిగా నే ననుకోవచ్చా?"

దుఃఖంలో నుంచి తెప్పరిల్లుకున్న మగువ ఇంత ప్రశ్న వేస్తుందని నేను వూహించలేదు.

"సుందరి? ... ఆ రాణీయా?" అనుకోకుండా బయట పడిపోయాను.

నా ముఖం సిగ్గుతో మండిపోతూంది. చేతులూ వణుకుతున్నాయి. తడబడుతూ సిగరెట్టు ముట్టించుకున్నాను. పొగ మింగడంలో పలకమారిపోయాను. ఉక్కిరి బిక్కిరి...

"మీది చాలా సున్నితమైన మనసు"

ఈ మారు తెల్లబోయాను.

"శిల్పసుందరిని చూస్తూ మైమరిచిపోయాను. పదండి, వెళదాం".

ఆమె ఏదో చెప్పాలని ఆరాట పడుతూందా? లేదా చెప్పాలని ఆరాట పడుతున్నది నేనా?

"కాకతి రుద్రమ ఈ ఆలయనిర్మాణం స్వయంగా పర్యవేక్షించిందట!"

"ప్రతి అద్భుతమైన కృషి వెనకా, కళాఖండం వెనకా ఒక స్త్రీ మూర్తి ఉంటుంది. కొంచెం టీ తాగుదామా? "

"నేను రాను."

"పోనీ, ఇక్కడికే తెప్పిస్తా." నేను గబగబా బయటకు వచ్చి టీ కుర్రాడికి చెప్పాను. మా బస్సు

వెకాలే గుడి దగ్గరలో టీ దుకాణ వచ్చింది,

ఇద్దరం ఆలయ ప్రాంగణంలో చతికిలబడ్డాం.

టీ తాగేసింది కన్యాకుమారి.

"మీరు అడగరు. నాకుతెలుసు."

ప్రశ్నించబడడానికి ఇదే ఆహ్వానమైనా నేను మౌనీ ముద్రే వేశాను.

ఒక్క లిప్తలో ఉప్పెన బద్దలైంది.

"క్రాంతికుమార్ పెళ్ళి చేసేసుకున్నాడు." ఆమె తల దించుకుని అంది. ఇక మౌనం కృతకంగా, క్రూరంగా ఉంటుంది. "ఇక్కడికి రాలేదేం?"

"నేను వస్తున్నానని.."

"శిథిలాలోనూ ఒక అందం ఉంది. అందుకే ఆ కవి మధురాతి మధురమైన కదనాలు విచారకరమైన ఆలోచనలు చెప్పేవే నన్నాడు."

"నిజంగా తనదాకా వచ్చినప్పుడు ఈ తాత్త్విక చింతన ఉంటుందా? ఉండగలదా;? ఆమె గొంతుల్లో ఉక్రోషం

"బతకాలి కాబట్టి ఆ ఆలోచనా సరళి అలవరుచుకోవాలి!" అనేసి ఒక క్షణం తరవాత తల ఎత్తి ఆమె కళ్ళ లోకి చూశాను.

నా వంకే తదేకంగా చూస్తోంది ఆమె

నాకు సిగ్గు వెయ్యలేదు- భయం వేసింది.

"మీరు....... మీరు ...., యూ ఆర్ గ్రేట్!"

నేను లేచి నుంచున్నాను. ఆమెకు చెయ్యి అందించాను. ఆ వూతతో ఆమె లేచి నిలబడింది.

"గురూజీ!"

జూనియర్ అల్లంత దూరాన ఆగిపోయాడు అతను చూశాననుకుంటున్న దేమిటో నాకు తెలుసు.

"కమాన్, లెట్స్‌గో! బస్సు బయలు దేరుతుందట!"

"ఫరవాలేదు. ఒక్క అయిదు నిమిషాలలో మిమ్మల్ని కలుస్తా!" కన్యాకుమారి జూనియర్ వంక చూడకుండా నా చేతిని ఆమె చేతిలోకి తీసుకుని మలుపు తిరిగింది.

నాకు వెనక్కి చూడాలనిపించలేదు.

"అదో బజారు మనిషి. ఆ క్రాంతి గాడితోనూ ఇలాగే తిరిగింది. ఒక్కొక్క క్యాంపులో ఒక్కొక్కడిని పడుతుంది!" ఎవరో అంటున్నారు.

కన్యాకుమారి ఆ మాటలు విందా?

శివలింగం ఎదుట నేను చేతులు జోడిస్తుండగా నన్ను అడిగింది "కాకతి రుద్రమకీ, శిల్పాచార్యుడికీ సంబంధం ఉందని మీరు నమ్ముతారా?"

"నమ్మను. ఉందని ఎవరైనా రుజువు చెయ్యగలిగితే, ఉన్నందుకు దిగ్భ్రాంతి చెందను. కాకతి

రుద్రమ కాకతి రుద్రమే!

"సుందరి ఎక్కడుంది?" ఆమె చటుక్కున అడిగింది.

ఎదుటి వారి వ్యక్తిగత విషయాల మీద మనుషులకు ఎందుకో ఇంత ఉత్సుకత!

నేను వినపడ్డా వినపడనట్టు నటించాను. కళ్ళు మూసుకుని చేతులు జోడించాను.

"ఈ ఒక్క ప్రశ్నకూ సమాధానం చెప్పండీ! ప్లీజ్" ఆమె అడిగింది మళ్ళీ.

నాకుశివమెత్తిందేమో ! ఆమె చెయ్యి పట్టుకుని గబగబా ఆమెను బయటకు తీసుకువచ్చి చెయ్యి విరగ్గొట్టబడిన శిల్పసుందరి వంక వేలెత్తి చూపించాను.

నిదానంగా ఆమె ఆ శిల్పం వంక చూసి తల దించుకుంది.

బస్సు హారన్ మృతులను మేల్కొలపడానికా అన్నట్టు మార్మోగి పోతూంది.

కన్యాకుమారి నా చెయ్యి పట్టుకుని నన్ను ముందుకు తీసుకు పోతోంది, బస్సులో ఉన్న మనుషులంతా తన వంకే చూస్తున్నారన్న ఆలోచన లేకుండా!

, ఆంధ్రప్రభ, 28.07.1982